# కథ

# సోషల్ రెస్పాన్సిబిలిటీ

డా॥ సి.ఎల్.రాణి

అమ్మ ఇచ్చిన కాఫీ కప్పు అందుకొని వరండాలోకి వచ్చి కూర్చున్నాను. వరండాలోంచి ఉదయపు ఆకాశం చాలా అందంగా కనిపిస్తుంది. ఆ నీలాకాశంలో తెల్ల మబ్బుల్ని, ఎగురుతున్న పక్షులని చూస్తూ వేడి వేడి కాఫీ త్రాగడం నాకు చాల ఇష్టమైన పని. రాత్రంతా నిద్ర లేకుండా ఒక్క నిముషం తీరిక లేకుండా కాల్స్ ఎటెండ్ చేస్తు, కస్టమర్స్ సమస్యలను తీరుస్తూ, నా క్రింది ఉద్యోగస్తుల డౌట్లు తీర్చే పని నాది. నేను ఒక మల్టీ నేషనల్ కంపెనీ కాల్ సెంటర్‌లో పని చేస్తున్నాను. కాఫీ త్రాగుతూ అక్కడే పడి ఉన్న సాక్షి పేపరు అందుకుని తిరగెయ్యడం మొదలుపెట్టా. ఒక హెడ్ లైన్ దగ్గర నా కళ్ళు ఆగిపోయేయి. "సామాజిక సేవకు డబ్బు కాదు... భావన ప్రధానం." రాష్ట్ర గవర్నర్ నరసింహన్. ఈ హెడ్ లైన్ నా గతాన్ని గుర్తుకు తెచ్చింది.

మా నాన్న గారు లారీ డ్రైవర్‌గా పనిచేసేవారు. మేము ఇద్దరు పిల్లలం, నేను, తమ్ముడును. నేను పెద్దదాన్ని. తమ్ముడు నాకంటే రెండేళ్ళు చిన్న. నాన్న గారు నాకు పదేళ్ళ వయస్సులో లారీ ఏక్సిడెంట్‌లో చనిపోయేరు. అమ్మకు ఏంచేయాలో పాలుపోలేదు. తనేం చదువుకోలేదు. నాన్న వైపు వారు ఎవరూ ఆదుకోలేదు. మా అమ్మకి నా అన్నవారు ఎవరూ లేదు. మా అమ్మమ్మ, తాతగారు తమ్ముడు పుట్టక ముందే పోయేరు. అమ్మకి స్వంత అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు ఎవరూ లేరు. నాన్నగారు పనిచేసే లారీ కంపెనీ ఓనరు గారు ఇచ్చిన పదివేల రూపాయలు, మమ్మల్ని తీసుకుని మా చిన్న తాతగారి కొడుకు ఇంటికి వెళ్ళింది. మా మావయ్య ఒక చిన్న కంపెనీలో గుమాస్తాగా పనిచేసేవాడు. అత్తయ్య చదువుకున్నా హౌస్‌వైఫ్‌గానే ఉండేది. మావయ్యకు ఇద్దరు కూతుళ్ళు. ఇంచు మించు మా వయస్సు వాళ్ళే. మావయ్యది మామూలు మధ్య తరగతి కుటుంబం. మా ముగ్గురిని పోషించే శక్తి లేదు. అయినప్పటికి పెద్ద మనసుతో మమ్మల్ని ఆదరించేడు. వాళ్ళ అమ్మాయిలతో సమానంగా అన్నీ కొనేవాడు. వాళ్ళతో సమానంగానే మమ్మల్ని చదివించాడు. అమ్మ తెచ్చిన డబ్బుని నా పేర బ్యాంక్‌లో వేసాడు. మావయ్య చాలా మంచివాడు. కానీ నాకు మా అత్తయ్య ఇంకా మంచిదనిపిస్తుంది. భర్త కజిన్ సిస్టర్‌ని తన పిల్లలని ఇంట్లో సొంత మనుషుల్లాగ చూడడం ఎంత గొప్ప విషయం.

అమ్మ అత్తయ్యని ఇంట్లో పనిని ముట్టుకోనిచ్చేది కాదు. మా నలుగురి పిల్లల పనులు, వంటపని, ఇంటిపని అన్నీ తనే చేసేది. మావయ్య అత్తయ్యల పట్ల అమ్మకి గొప్ప కృతజ్ఞతాభావం, అంతకంటే ఎక్కువ అపరాధ భావం ఉంది. తమ్ముడి మధ్యతరగతి కుటుంబం మీద పడి తింటున్నామే అనే బాధ. తమ్ముడు, నేను ఇంటరు చదివేటప్పటి నుంచి చిన్న పిల్లలకి ట్యూషన్లు చెప్పి కొంత డబ్బు సంపాదించి మావయ్యకు ఇచ్చే వాళ్ళం.

అత్తయ్య పనిలేక ఖాళీ ఎక్కువ అయిపోయిందని అమ్మ దగ్గర గోల పెట్టేది. అమ్మ బలవంతంమీదే తను మా యింటికి దగ్గరలోనే ఉన్న బ్యూటీ క్లినిక్‌లో హెల్పర్‌గా చేరింది. బ్యూటీషియన్ దగ్గర అన్ని రకాల ఫేషియల్స్, ట్రీట్‌మెంట్స్ ఇవ్వడం నేర్చుకుంది. నెమ్మదిగా బ్యూటీ కోర్స్‌లో డిప్లమో సంపాదించింది. ఆ బ్యూటీషియన్ భర్తకు వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అవడంతో అత్తయ్యకు ఆ క్లినిక్ అప్పచెప్పి ఆవిడ భర్తతో వెళ్ళిపోయింది. ఇప్పుడు అత్తయ్య ఊర్లో ఒక పేరున్న బ్యూటీషియన్‌గా నిలదొక్కుకుంది.

నేను, అత్తయ్య కూతుళ్ళిద్దరు ఒకే కాలేజీలో డిగ్రీ చదువుకున్నాం. మావయ్య తమ్ముడిని ఇంజనీరింగ్ చదివించేడు. ఈ మధ్యనే వాడు ఒక మల్టీనేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జాబ్‌లో చేరేడు.

నాకు చిన్నప్పటి నుండి ఇంగ్లీష్ అంటే ఇష్టం. చాలా బాగ చదివేదాన్ని. కాలేజీ అంతటికి ఇంగ్లీష్‌లో నేనే ఫస్ట్. మా క్లాస్‌మేట్ ఒకమ్మాయి ఆంగ్లో ఇండియన్. తనకి తెలుగు బాగా రాదు. దాంతో నేనెప్పుడూ తనతో ఇంగ్లీష్‌లోనే మాట్లాడేదాన్ని. అలా నాకు ఇంగ్లీష్ మాట్లాడడం బాగా వచ్చింది. నేను ట్యూషన్ చెప్పే అమ్మాయి ఇంట్లో కంప్యూటర్ ఉంది. వాళ్ళమ్మగారు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నా సరదా చూసి ఆవిడ నాకు కంప్యూటర్‌లో బేసిక్స్ నేర్పేరు. తరువాత కొన్ని కంప్యూటర్ కోర్సులు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లోనే చేసేను.

డిగ్రీ ఫైనల్ పరీక్షలు అయిపోయిన వెంటనే మా కాలేజీలో కొన్ని మల్టీ నేషనల్ కంపెనీలు జాబ్ మేళాను పెట్టేయి. మా అత్తయ్య కూతుళ్ళు, నేను దానికి వెళ్ళేము. ఇంగ్లీష్, కంప్యూటర్ బాగా రావడంతో నేను ఇప్పుడు పనిచేస్తున్న కంపెనీ కాల్ సెంటర్లో సెలెక్ట్ అయ్యాను. కాని అత్తయ్య కూతుళ్ళు సెలెక్ట్ కాలేదు. నేను జాబ్‌లో చేరిపోయేను. అప్పుడే నాకు నాలుగేళ్ళ సర్వీస్ అయిపోయింది. ఈ మధ్యనే నాకు ప్రమోషన్ కూడ వచ్చింది. జీతం పాతిక వేలయ్యింది.

అత్తయ్య, అత్తయ్య కూతుళ్ళిద్దరూ నాకు జాబ్ వచ్చినందుకు ఎంతో సంతోషించారు. ఏ మాత్రము ఈర్ష్య పడలేదు. వాళ్ళిద్దరూ అత్తయ్య

లాగే బ్యూటీషియన్ కోర్సులు చేసి బ్యూటీక్లినిక్‌ని ఇంకా బాగా డెవలప్ చేసేరు. ఈ మధ్యే మా మావయ్య మా ముగ్గురికి సంబంధాలు చూడ్డం మొదలెట్టేడు. ఇప్పుడు మావయ్య కుటుంబం అప్పర్ మిడిల్ క్లాసు కుటుంబం అయ్యింది.

రాధికా ! ఏం చేస్తున్నావు" అన్న అత్తయ్య మాటలతో వర్తమానంలోకి వచ్చేను. అత్తయ్యకు నేనంటే చాలా ఇష్టం. నాకు తను "ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్". తనే నాకు రోల్ మోడల్", తనకి నేను చదివిన హెడ్‌లైన్ చూపించి, "అత్తయ్య ! గవర్నర్ గారు చెప్పింది. మావయ్య, నీ విషయంలో హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్" అన్నాను. తను కూడ హెడ్‌లైన్ దాంట్లో మాటర్‌ని చదివి "కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అని చాల కంపెనీలు చేస్తున్నాయి. కంపెనీలు వాతావరణాన్ని సమాజాన్ని మెరుగు పరచడానికి తీసుకునే చర్యలనే కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అంటున్నారు. అవి ఏ సమాజంలో ఉంటూ లాభాలు పొందుతున్నాయో, ఆ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్యం, విధ్య, ఉపాధి అవకాశాలు కల్పించి వాళ్ళ జీవితాలు మెరుగుపరచడం. కాని నా అభిప్రాయం ఈ బాధ్యత ప్రతీ వ్యక్తిది. సోషల్ రెస్పాన్సిబిలిటీని ప్రతీ వ్యక్తి ఫీలవ్వాలి. మనం ఏ సమాజంలో ఉంటూ అన్నీ దానిలోనుంచి పొంది ఆనందంగా జీవిస్తున్నామో, ఆ సమాజానికి ఎంతో కొంత సేవ చేయడమే "సోషల్ రెస్పాన్సిబిలిటీ" అంది. నేను "నువ్వు నీ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిర్వహించేవు. మమ్మల్ని ముగ్గురినీ ఆదరించి తమ్ముడిని, నన్నూ బాగా లైఫ్‌లో సెటిల్ చేసేవు. కాని నేనేం చెయ్యాలో తెలీటం లేదే" అన్నాను. నాకు భగవంతుడు సమాజం పట్ల నా బాధ్యత నిర్వహించడానికి మిమ్మల్ని చూపించేడు. అలాగే నువ్వు ప్రయత్నిస్తే ఆ దేవుడు అవకాశం ఇస్తాడు" అని అత్తయ్య అంది.

స్నానం చేసి అమ్మ ఇచ్చిన టిఫిన్ తిని గురువారం అవడం వలన సాయిబాబా గుడికి బయలుదేరేను. దారంతా అవే ఆలోచనలు "ఏం చెయ్యాలి" అని. గుడికి రెండు వైపులా బిచ్చగాళ్ళు చాలామంది ఉన్నారు. "అమ్మా! ధర్మం చెయ్యండి", "సాయిరామ్" అంటూ, వాళ్ళకు దూరంగా ఎవరినీ ఏమీ అడక్కుండా అతను కూర్చొని ఉన్నాడు. అరవై ఏళ్ళకు పైనే ఉంటుంది అతని వయస్సు. అత్తయ్య వాళ్ళింటికి వచ్చిం దగ్గరనుండి ఈ గుడికే నేను ప్రతీ గురువారం వస్తున్నాను. వారం మధ్యలో కూడ అప్పుడప్పుడు గుడికి వస్తుంటాను. ఇంచు మించు అప్పటినుంచే అతన్ని చూస్తున్నాను. పోలియో వచ్చి పూర్తిగా చచ్చుబడిపోయిన కాళ్ళు. ఎక్కడికైనా దేక్కుంటూనే వెళతాడు. ఎప్పుడూ బాబాగారి గుడి ముందే కూర్చుంటాడు, ఎవరిని ఏమీ అడగకుండా. మిగిలిన బిచ్చగాళ్ళు గురువారం నాడే బాబాగారి గుడి ముందు కనిపిస్తారు. వాళ్ళే సోమవారంనాడు శివాలయం దగ్గర, మంగళవారం నాడు ఆంజనేయస్వామి గుడి దగ్గర, శనివారం వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర కనపడతారు. వాళ్ళని చూస్తే నాకు సదభిప్రాయం లేదు. కమర్షియల్ బెగ్గర్స్ వాళ్ళు. కాని అతను ఎప్పుడూ బాబాగుడి దగ్గరే కనిపిస్తాడు. "అవునూ! నా సోషల్ రెస్పాన్సిబిలిటీ ఇతనితో మొదలుపెడితే" అనిపించింది. "ప్రేమ" అని ఒక ఓల్డ్‌ఏజ్ హోమ్ ఉంది. అక్కడ వృద్ధులను ఎవరైనా స్పాన్సర్ చేస్తే చేర్చుకుంటారు. అది ఒక నాన్ ప్రోఫిటబుల్ ఆర్గనైజేషన్. అతన్ని అందులో చేర్చి అతనికి నెల నెల పేచేస్తే బాగుంటుంది కదా అనిపించింది.

గుడిలోకి వెళ్ళి బాబాకు నమస్కరించి బయటకు వచ్చి అతని దగ్గరకు వెళ్ళాను. "బాబూ నీ పేరేంటి" అని అడిగి పది రూపాయలు నోటు అతని ముందు వేసేను. అతను మాట్లాడకుండా తొమ్మిది రూపాయి బిళ్ళలు తీసి నాకందించబోయేడు. వద్దని చేత్తోనే వారించి అయ్యో మూగ చెవిటి వాడు కూడానా" అని అనుకున్నాను. "ఆ నోటు నీకే బాబు, నాకు చిల్లర ఇవ్వక్కరలేదు. నీకు నేను సాయం చేద్దామనుకుంటున్నాను, ఎంతకాలం ఇలా అడుక్కుంటావు? నిన్ను ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో చేర్పించి నీ ఖర్చులు నేనే భరిస్తాను వెళతావా?" అని ఈసారి ఇంకా దగ్గరగా వెళ్ళి గట్టిగా అన్నాను. "తల్లా!! బాబాగోరి దయవల్ల నాకు ఏనోటు నేదు, సంతోసంగా బతుకుతున్నా, నా పేరడిగి నోరు కదా! నన్ను దేవుడని పిలుస్తారు. నన్ను ఎక్కడా సేర్పింసొద్దు తల్లా!" అన్నాడు అహా ఇతనికి చెవుడు లేదన్నమాట అనుకొని "అది కాదు దేవుడూ! ఎన్నాళ్ళిలా అడుక్కుంటావు నీకు వయస్సు పెరుగుతుంది కదా! నీకు సహాయం చేసేనన్న తృప్తి నాకు ఉంటుంది. నా మాట కాదనకు" అన్ననాను, "తల్లా!! ఇంత మంచి మనసున్న నీకు బగమంతుడు అంతా మంసే సేయాల, నేను ఎక్కడకు ఎల్లను" అన్నాడు. ఒక్కసారి ఖంగు తిన్నాను. 'ఎంత చెప్పినా వినడేంటి? నేనేదో గొప్పగా సాయం చెయ్యాలనుకుంటే వద్దు పొమ్మంటాడేంటి! ఏం చూసుకుని ఈ గర్వం' అనుకుంటూ అక్కడే కదలకుండా నిలబడి పోయేను. కాస్సేపయ్యేక దేవుడికి నా భావం అర్థమయిందనుకుంటా. "తల్లా! ఏం అనుకోనంటే రాత్రి తొమ్మిది గంటలకు గుడి దగ్గరకు రా తల్లా! నిన్ను ఓ దగ్గరికి తీసుకెల్లాల" అన్నాడు, నాకు చాల కోపం వచ్చింది. రాత్రి తొమ్మిది గంటలకు ఎక్కడకో తీసుకెళతాడట. తీసుకెళ్ళి ఏంచేస్తాడోనని భయం కూడ వేసింది.

ఇంటికి వచ్చి సోఫాలో నిస్త్రాణగా కూలబడిపోయేను. అత్తయ్య బ్యూటీక్లినిక్ వెళ్ళడానికి తయారవుతూ నన్ను చూసింది. 'ఏంటి! అలా ఉన్నావు" అని అడిగింది. అంతా చెప్పేను, 'నీకు రాత్రి పదకొండు గంటలకు కదా డ్యూటీ. ఇప్పుడు బాగా నిద్రపోయి రాత్రి తొమ్మిది గంటలకు తమ్ముడితో బైక్‌మీద వెళ్ళు, తనుంటాడు గాబట్టి భయపడక్కరలేదు" అని అంది. అదే మంచిదనిపించింది.

రాత్రి తొమ్మిది గంటలకు తమ్ముడు, నేను వాడి బైక్ మీద బాబా గుడికి వెళ్ళేము. మమ్మల్ని చూసి దేవుడు చిరునవ్వు నవ్వేడు. కుడి వైపుకు తిరిగి దూరంగా ఉన్న ఒకతన్ని రమ్మని చేత్తో సైగచేసేడు. అతని వయస్సు సుమారు పాతికేళ్ళుంటాది. అతను వెళ్ళి రిక్షాని పట్టుకు వచ్చి దేవుడిని ఎత్తుకొని అందులో కూర్చోబెట్టాడు, దేవుడు అతనితో "పంతులు గారి గుడికి తీసికెల్లు" అని మమ్మల్ని చూసి "తల్లా! మీరు రిక్సా ఎనకేరాండి" అన్నాడు.

దేవుడు వెళుతున్న రిక్షాని మేము బైక్ మీద నెమ్మదిగా ఫాలో అయ్యేము. సుమారు రెండు కిలో మీటర్లు అలా వెళ్ళేమేమో. రిక్షా ఒక చిన్న గుడి ముందు ఆగింది. రిక్షా అతను దేవుడని ఎత్తుకుని గుడిలోకి వెళుతూ మమ్మల్ని రమ్మన్నాడు. తను గుడి వెనక వైపువున్న రెండు పెంకుటి గదుల దగ్గర దేవుడిని దింపేడు. గుడి పూజారి గారు కాబోలు ఒక గదిలోంచి బయటకు వచ్చేరు. ఆయన వెంట ఆయన భార్య కాబోలు బయటకు వచ్చింది. అతను సంతోషంగా "దేవుడూ వచ్చేవా! పిల్లలూ నిద్రపొండ్రా అంటే వినకుండా తాతయ్యని చూడకుండా పడుకోం అంటూ గోలచేస్తున్నారు" అని అన్నాడు. ఆ మాటలు విని రెండో గదిలోంచి సుమారు పదిమంది పిల్లలు "తాతయ్య! తాతయ్య!" అంటూ దేవుడి దగ్గరకు పరిగెత్తుకు వచ్చేరు. వాళ్ళు సుమారు రెండేళ్ళనుండి పన్నెండేళ్ళ వయస్సు వాళ్ళు. 'ఏంచేస్తున్నారా!

అన్నాలు తిన్నారా? ఇంకా పండుకోలేదా?" అంటూ వాళ్ళందరిని ప్రేమతో దగ్గరకు తీసుకున్నాడు. నేను తమ్ముడు ఏమి అర్ధంకాక తెల్ల మొఖాలేసుకుని చూస్తున్నాం.

దేవుడు చొక్కాలోంచి ఒక సంచితీసి నేలమీద బోర్లించేడు సుమారు మూడొందల రూపాయి రెండు రూపాయ బిళ్ళలు నేనిచ్చిన పదిరూపాయల నోటు నేలమీద పడ్డాయి. 'పంతులుగోరు నాకు పాతిక రూపాయిలిచ్చి మిగిలింది పిల్లల కర్సుకుంచండి బాబయ" అన్నాడు దేవుడు. పూజారి గారు దబ్బంతా లెక్కగట్టి నాలుగొందల అరవై అని చెప్పి పాతిక రూపాయలు తీసి దేవుడి సంచిలో వేసి ఇచ్చేరు.

దేవుడు మమ్మల్ని దగ్గరకు రమ్మని సంజ్ఞచేసి "ఈళ్లందరూ నాకు దేవుడిచ్చిన పిల్లలమ్మా! ఈళ్ళనొదిలి నేనెక్కడికెల్లనూ?" అని అడిగేడు, నాకు తమ్ముడికి ఏమీ అర్ధం కాలేదు. ఈ లోపల దేవుడిని తీసుకొచ్చిన రిక్షా అతను చెప్పడం మొదలు పెట్టేడు. "అమ్మా! మా దేవుడు నిజంగా దేవుడమ్మా. ఎవరో కనిపారేసిన పిల్లలమ్మా వీళ్ళంతా. వీళ్ళని ఈ దేవుడే పోషిస్తున్నాడు. అసలు ముందు మా దేవుడి గురించి చెప్పాలమ్మ. తన తల్లి దండ్రులెవరో దేవుడికి తెలీదు. చంటి పిల్లాడుగా ఉన్నప్పుడు ఎవరో అడుక్కొనే వాడికి దొరికేడట. అతనే దేవుడిని పెంచి పెద్ద చేసేడట. అతనికి దేవుడు దొరికే సరికే దేవుడుకి పోలియో వచ్చి కాళ్ళు చచ్చుబడిపోయేయట. దేవుడిని ఎత్తుకుని తీసుకొనివెళ్ళి గుళ్ళ దగ్గర బిచ్చమెత్తుకొనే వాడట. దేవుడికి కొంచెం ఊహ వచ్చేసరికి అతను చచ్చి పోయేడట. ఏపని చెయ్యలేని దేవుడు అతని అడుగు జాడలలోనే నడుస్తూ గుళ్ళ దగ్గర కూర్చొని అడుక్కోవడం మొదలెట్టేడట. పెద్దయ్యాక ఒక గుడ్డి పిల్లను దేవుడు పెళ్ళి చేసుకున్నాడు. తనని ఆదరించిన తన పెంపుడు తండ్రిలాగే తనూ ఎవ్వరైన అనాథకి ఆశ్రయం ఇవ్వాలనుకున్నాడట. దేవుడికి దొరికిన మొదట అనాథను నేను. అప్పుడే పుట్టిన పిల్లాడిగా నేను దేవుడుకి ఈ గుడికి దగ్గరలో ఉన్న చెత్త కుండీలో దొరికేనట. దేవుడు నన్ను తన గుడిసెలో ఉంచుకుని టెన్త్ క్లాస్ మునిసిపల్ స్కూల్లో చదివించేడు. అడుక్కొని సంపాదించిన డబ్బుల్లోనే ఒక సెకండ్ హేండ్ రిక్షా కొనిచ్చేడు. రోజూ నేను దేవుడిని బాబాగారి గుడి దగ్గర దింపి బయట బేరాలు వేసుకుంటాను. రాత్రికి దేవుడిని ఈ గుడికి తీసుకువచ్చి తరువాత ఇంటి దగ్గర దింపుతాను. బేరాల డబ్బుల్లోనే నేను బ్రతుకుతూ ప్రయివేటుగా డిగ్రీ పరీక్షలు రాస్తున్నాను. నాయీ బ్రతుకు దేవుడు పెట్టిన భిక్షే.

దేవుడు ఒక్క పిల్లాణ్ణి పెంచడంతో తృప్తి పడలేదు. రోడ్లమీద, చెత్త కుండీలలో దొరికే పిల్లలకు ఏదో ఒకటి చెయ్యాలనే తాపత్రయం. అలాంటి పిల్లల గురించి వాకబుచేసి వాళ్ళని ఇంటికి తెచ్చుకుని కొంతకాలం పెంచేడు. తన గుడిసె చాలక వాళ్ళని పెంచడం కష్టమయింది. ఈలోపల ఈ గుడి పూజారిగారితో దేవుడికి పరిచయం అయ్యింది. పూజారి గారితో పిల్లల విషయం చెప్పి దేవుడు బాధపడ్డాడట. పూజారిగారు "నువ్వే ఇంత కష్టపడి వాళ్ళని పెంచుతున్నప్పుడు మాలాంటి వాళ్ళం కూడా కొంత సహాయం చెయ్యాలి కదా!" అని వాళ్ళ గుడి ధర్మకర్తను అడిగి తను ఉంటున్న గది పక్కనే ఉన్న ఆఫీస్ గదిని పిల్లలను ఉంచడానికి అడిగేరట. ఆ ధర్మకర్త గుడి ఆఫీస్‌ని అక్కడ నుంచి మార్చి ఆ గదిని ఇవ్వడంతో ఈ పిల్లలందరిని ఇక్కడకు మార్చేరు. పూజారిగారు, ఆయన భార్య పిల్లలందరి ఆలనాపాలనా చూస్తున్నారు. కాని వాళ్ళకయ్యే ఖర్చునంతా దేవుడే భరిస్తాడు. తనకు రోజూ వచ్చే డబ్బుల్లోంచి కొంచెం తన కుటుంబ ఖర్చుల నిమిత్తం ఉంచుకుని మిగిలిన డబ్బు అంతా పిల్లల పోషణకే దేవుడు ఇస్తున్నాడు. వీళ్ళలో అయిదేళ్ళు నిండిన వాళ్ళను స్కూలుకి పంపుతున్నారు. పూజారిగారు, ఆయన భార్య వీళ్ళని ప్రేమతో పెంచడమే కాకుండా మంచి ప్రవర్తనా, శ్లోకాలు, సనాతన ధర్మాలు అన్నీ నేర్పుతున్నారు. ఈ మధ్య కొంతమంది బయటవాళ్ళకి వీళ్ళ గురించి తెలిసి వాళ్ళు డబ్బులు, బట్టలు, బిస్కెట్లు, స్వీట్లు, దుప్పట్లు, పుస్తకాల్లాంటివి ఇస్తున్నారు" అని అతను ముగించేడు.

హంగు, ఆర్భాటం, పబ్లిసిటీ లాంటివి లేకుండా గుప్తంగా దేవుడు అనాథశరణాలయం నడుపుతున్నాడన్నమాట. దేవుడు తన పేరుని నిజంగా సార్ధకం చేసుకున్నాడు. 'దేవుడూ! నువ్వు నిజంగా వీళ్ళ పాలిట దేవుడేనయ్యా' అన్నాను ఇంకేమనాలో తెలీక. దేవుడు వెంటనే "తల్లా! నేసేత్తుంది తప్పో ఒప్పో తెలీదు. అదుక్కుతెస్సుకున్న డబ్బుల్లోనే ఈల్లను సాకుతున్నాను. బాబాగోరి గుడి దగ్గర లచ్చింవోరమైతే మూడు నాలుగొందలు ఒత్తాయి ఉత్తిరోజులయితే యేభై అరువయ్ ఒత్తాయి. నాకు రోజంతా గుడి అయిగోరిచ్చే పెసాదాలతో కదుపునిండిపోద్ది. నా యింటిది ఏదో ఇంత ఉడకేసుకు తింతాది. ఇంత డబ్బు నానేం సేసికోను? నానెవురిని ఏవీ అడగను. దమ్మ పెబువులు తోచిందిత్తారు. ఈ పూజారయ్యోగోరు నన్ను పున్నేత్ముడంతారు. కాని తనే పెద్ద పున్మేత్ముడు. పిల్లగాయల్ని సక్కగా సాకుతున్నారు. నేనక్కడకెల్లి పోతే నాయింటి దాన్నెవరు సూత్తారు? ఈ పిల్లల నెవరు సూత్తారు?" అని అన్నాడు.

"నిజమైన సోషల్ రెస్పాన్సిబిలిటీ ఇంకేముంటుంది ఇంతకంటే". అని అనిపించింది నాకు. తమ్ముడు "అక్కా! నీకు డ్యూటీకి టైమయిపోతుంది. వెళదామా? నేను వీళ్ళకి నెల నెలా వెయ్యిరూపాయిలిస్తాను'' అని అన్నాడు, నేను కూడ నా వంతు నెల నెలా వేయి రూపాయిలు ఇస్తాను" అని చెప్పి చెమర్చిన కళ్ళతో తమ్ముడితో గుడి బయటకు వచ్చేను. 'తమ్ముడూ! దేవుడు చేస్తున్న పని విపరీతంగా లాభాల్లో నడుస్తున్న కంపెనీలు నిర్వహిస్తున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ మించిపోయిందిరా" అన్నాను. "అవునక్కా" అంటూ వాడు బైక్‌ని స్టార్ట్ చేసేడు.



శ్రీ సచ్చిదానందపీఠం ఆధ్వర్యంలో జరిగిన అధ్యాపక దినోత్సవంలో ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని డా॥ద్వానాశాస్త్రికి అందజేస్తున్న ప్రముఖ విద్యావేత్త శ్రీ చుక్కా రామయ్య. సభాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఉత్తమ అధ్యాపకురాలు శ్రీమతి వేమూరి ప్రసన్న, శ్రీమతి ఉషావినోద్‌లను చూడవచ్చు.